## క్లుప్తంగా

### ప్రజారక్షణ భేరి పోస్టర్ల విడుదల

పోరుమామిళ్ల : సీపీఎం ఆధ్వర్యంలో రాష్ట్రంలో నిర్వహిస్తున్న బస్సు యాత్ర, విజయవాడలో ఈనెల 15న జరిగే బహిరంగ సభలకు సంబంధించిన పోస్టర్లను శుక్రవారం ఆ పార్టీ నాయకులు విడుదల చేశారు. సీపీఎం మండల కార్యదర్శి భైరవప్రసాద్ పాల్గొన్నారు.

### రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

అట్లూరు : స్థానిక జెడ్పీహెచ్ఎస్ నుంచి ఐదు మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి ఆటల పోటీలకు ఎంపికైనట్లు ఆపాఠశాల ప్రధానోపాధ్యాయుడు అశ్వర్థరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయుడు రమేష్‌యాదవ్‌లు తెలిపారు. మల్కంబ్ అండర్ 14 జట్టుకు వేణుగోపాల్, అండర్ 17 జట్టుకు హరిచరన్, బాలికల అండర్ 17 జట్టుకు స్వాతిలక్ష్మి, ఈనెల 19న నంద్యాలలో జరిగే బేస్‌బాల్ అండర్14 జట్టుకు కృష్ణహేమంత్, నెట్‌బాల్ అండర్ 14 జట్టుకు జశ్వంత్‌లు ఎంపిక అయ్యారన్నారు. వారందరిని శుక్రవారం ఉపాధ్యాయ బృందం అభినందించారు.

### సీఎంను కలిసిన వక్ఫ్ బోర్డు చైర్మన్



మైదుకూరు : జిల్లా పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని శుక్రవారం వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ మదీనా దస్తగిరి కలిశారు. మైదుకూరుకు చెందిన మదీనా దస్తగిరి ఇటీవల జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్‌గా నియమితులైన విషయం తెలిసిందే. శుక్రవారం ఇడుపులపాయ హెలిప్యాడ్ వద్ద ముఖ్యమంత్రిని కలిసిన మదీనా దస్తగిరి, తనను వక్ఫ్‌బోర్డు చైర్మన్‌గా నియమించినందుకు ధన్యవాదాలు తెలిపి, సీఎం జగన్‌ను శాలువాతో సత్కరించారు.

### ధృవీకరణ పత్రాల అందజేత

బి.కోడూరు : మండలంలోని అన్ని రైతుభరోసా కేంద్రాల్లో 2023 ఖరీఫ్‌లో పంటలు సాగు చేసి ఈ క్రాప్ నమోదు చేయించుకున్న రైతులందరికీ ఈ క్రాప్ నమోదు ధృవీకరణ పత్రాలను అందజేస్తారని పోరుమామిళ్ల డివిజన్ ఏడీఏ మురళీధర్ రెడ్డి, మండల వ్యవసాయాధికారి టి.కౌశికలు తెలిపారు. శుక్రవారం బి.కోడూరు రైతుభరోసా కేంద్రంలో ఈ-క్రాప్ నమోదు చేసుకున్న రైతులకు వారు ధృవీకరణ పత్రాలను అందజేశారు.

### ప్రతి విద్యార్థి కష్టపడి చదవాలి



భోజనశాలను ప్రారంభిస్తున్న నాయకులు

కాశినాయన : ప్రతి విద్యార్థి కష్టపడి చదివి తల్లి దండ్రులకు మంచిపేరు తీసుకురావాలని బద్వేలు మార్కెట్ మాజీ చైర్మన్ రాజేశ్వరి, మాజీ వైస్‌చైర్మన్ రమణారెడ్డిలు తెలిపారు. శుక్రవారం నరసాపురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.5 లక్షల సొంత ఖర్చుతో ఏర్పాటు చేసిన భోజనశాలను వారు ప్రారంభించి మాట్లాడారు. పాఠశాలలో భోజనశాల ఏర్పాటుకు కృషిచేయాలని పాఠశాల ఉపాధ్యాయులు కోరడంతో భోజనశాలను ఏర్పాటు చేశామన్నారు.

# ఆదర్శ ముఖ్యమంత్రికే మళ్లీ పట్టం కడదాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి



ఐత్రంపేటలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

మైదుకూరు : దేశంలో ఏ రాష్ట్రంలో ఏ ముఖ్యమంత్రి అమలు చేయని సంక్షేమ పథకాలను అమలు చేసి ఆదర్శ ముఖ్యమంత్రిగా నిలిచిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే మళ్లీ పట్టం కడదామని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఆదిరెడ్డిపల్లె సచివాలయం వద్ద ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రఘురామిరెడ్డి మాట్లాడుతూ విద్య, వైద్య, వ్యవసాయ రంగాల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయని అన్నారు. ఆదిరెడ్డిపల్లె సచివాలయ పరిధిలో రూ.25.93 కోట్లతో ప్రజలకు లబ్ధి చేకూరిందని తెలిపారు. సంక్షేమ బోర్డును ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అనంతరం పార్టీ జెండాను ఎగురవేశారు.

**ప్రభుత్వం మేలును వివరించండి**

దువ్వూరు : ప్రభుత్వం చేసిన మేలును ప్రజలకు వివరించాలని మైదుకూరు నియోకవర్గ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ శెట్టిపల్లె నాగిరెడ్డి తెలిపారు. శుక్రవారం దువ్వూరు సచివాలయం -2లో ఆంధ్రప్రదేశ్‌కు మళ్లీ జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా సచివాలయ సచివాలయంలో ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ మదీనా దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

**తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టాలి**

చాపాడు : టీడీపీ నాయకులు ప్రభుత్వంపై చేస్తున్న తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టాలని.. ప్రతి ఇంటికి వెళ్లి వారి కుటుంబానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ద్వారా పొందిన లబ్ధిని వివరించాలని ఎంపీపీ తెలిదేల లక్ష్మయ్య పేర్కొన్నారు. మండలంలోని అయ్యవారిపల్లె గ్రామంలో శుక్రవారం సాయంత్రం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు.

**రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే మళ్లీ జగనన్ననే సీఎం కావాలి**

బి.కోడూరు : రాష్ట్రం పారిశ్రామికంగాను, ఆర్థికంగాను అభివృద్ధి చెందాలంటే 2024లో తిరిగి మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని ఎమ్మెల్యే డాక్టర్ సుధ తెలిపారు. శుక్రవారం ఐత్రంపేట సచివాలయంలో నిర్వహించిన ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాలుగున్నర ఏళ్ల కాలంలో రాష్ట్రంలోని బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలను తీసుకువచ్చి రాష్ట్రంలోని ప్రజల అభివృద్ధికి తోడ్పడ్డారన్నారు. అభివృద్ధి కొనసాగాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలనే విషయాన్ని స్థానికంగా ఉన్న ప్రజలకు వివరించాలని గృహసారథులకు, వలంటీర్లకు ఆమె సూచించారు. ఐత్రంపేట సచివాలయం పరిధిలో సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారులకు ఇప్పటి వరకు సుమారు రూ.22.50 కోట్లు లబ్ధి అందిందని తెలిపారు. కార్యక్రమంలో పీఆర్‌ఆర్‌డీ ప్రభుత్వ సలహాదారు నాగార్జునరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, జెడ్పీటీసీ దావీదు, మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ విజయకుమారి, వైఎస్సార్‌సీపీ నాయకులు పిచ్చిరెడ్డి, రామలక్ష్మిరెడ్డి, ఓబయ్య, రాజశేఖర్, చిన్నయ్య, నారాయణరెడ్డి, ఎంపీడీఓ భాస్కర్ రావు, గృహసారథులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బద్వేలు అర్బన్ : మడకలవారిపల్లె సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సుధ పాల్గొని మాట్లాడారు. గడిచిన నాలుగున్నర ఏళ్ల కాలంలో సచివాలయ పరిధిలోని 1800 కుటుంబాలకు ప్రత్యక్ష నగదు బదిలీ కింద రూ.22.77 కోట్లు, పరోక్ష ప్రయోజనాల కింద రూ.17.03 కోట్లు చొప్పున మొత్తం రూ.39.80 కోట్లు నిధులు జమ చేయడం జరిగిందని తెలిపారు. ఇంత పెద్ద ఎత్తున సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు మేలు చేస్తున్న వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డిని రాబోవు ఎన్నికల్లో మళ్ళీ ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం గడిచిన నాలుగున్నర ఏళ్ల కాలంలో ప్రత్యక్ష నగదు బదిలీ, పరోక్ష ప్రయోజనాలు కింద చేకూరిన లబ్ధిని తెలిపే బోర్డును ప్రదర్శించారు. అనంతరం సచివాలయం ఆవరణలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సచివాలయం పరిధిలోని ప్రజలతో సహపంక్తి భోజనం చేసి రాత్రినిద్రకు ఉపక్రమించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు సుందర్‌రామిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ యద్దారెడ్డి, గిద్దలూరు అసెంబ్లీ ఎన్నికల పరిశీలకులు బంగారుశీనయ్య, మున్సిపల్ వైస్‌చైర్మన్ గోపాలస్వామి, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ నాగంసుబ్బారెడ్డి, వార్డు ఇన్‌చార్జిలు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి ఎస్.వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గోపవరం : మండలంలోని బ్రాహ్మణపల్లె సచివాలయం పరిధిలో శుక్రవారం ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి కార్యక్రమాన్ని సర్పంచ్ కలువాయి లక్ష్మీదేవి అధ్యక్షతన నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ పుల్లయ్య, పార్టీ నాయకులు సచివాలయం పరిధిలో సంక్షేమ పథకాల ద్వారా డీబీటీ, నాన్‌డీబీటీ ద్వారా లబ్ధిపొందిన బోర్డును ఆవిష్కరించారు.

పోరుమామిళ్ల : రంగసముద్రం సచివాలయం 2లో శుక్రవారం నిర్వహించిన మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్ ఎందుకు కావాలి అనే కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సుధ పాల్గొని మాట్లాడారు. అనంతరం రాష్ట్ర పీఆర్‌డీ సలహాదారు నాగార్జునరెడ్డి, జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, వైస్ ఎంపీపీలు సీఎం బాషా, రాజశేఖర్, సర్పంచ్ చిత్తా రవిప్రకాష్‌రెడ్డిలు మాట్లాడుతూ రంగసముద్రం పంచాయతీ అభివృద్ధికి ఇంతవరకు రూ.35 కోట్లు ఖర్చు చేశారని, రంగసముద్రం, కమ్మవారిపల్లె, నర్సింగుపల్లెలను కలుపుతూ రోడ్డు వేశామని ఇంతగా పంచాయతీ అభివృద్ధికి సహకరించిన జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నారు.

### తాగునీటి పథకం కోసమే రోడ్డును తవ్వారు

ప్రొద్దుటూరు : రూ.150 కోట్ల అమృత్ తాగునీటి పనుల కోసమే రోడ్డును తవ్వాల్సి వచ్చిందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. స్థానిక బొల్లవరం నుంచి అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ వరకు ప్రారంభించిన రోడ్డు పనులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మున్సిపాలిటీ ప్రజలు గత 20 ఏళ్లుగా తాగునీటికి పడిన కష్టాలు అన్ని, ఇన్ని కావన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నన్ని రోజులు, తర్వాత తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కూడా పాతికేళ్లపాటు నంద్యాల వరదరాజులరెడ్డి ఎమ్మెల్యేగా పనిచేశారన్నారు. ఆయనతోపాటు తర్వాత ఎమ్మెల్యే అయిన మల్లేల లింగారెడ్డి సైతం ఈ సమస్య పరిష్కారానికి కృషి చేయలేకపోయారన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తూనే అసంపూర్తిగా ఆగిన అమృత్ నీటి పథకాన్ని కొలిక్కి తెచ్చి పరిష్కరించామన్నారు.

**మంచి చేసే వారికే ఓటు వేయండి**

ప్రస్తుత సీఎం వైఎస్ జగన్ పరిపాలనను, గత చంద్రబాబు పరిపాలనను గమనించిన మీరు మంచి చేసిన వారిని గుర్తించి ఓటు వేయాలని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. 12వ సచివాలయం పరిధిలో ఆంధ్రప్రదేశ్‌కి మళ్లీ జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే 11వ వార్డులో జరిగిన లబ్ధిని ఫ్లెక్సీ ద్వారా వివరించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వార్డు ఇన్‌చార్జి కసిరెడ్డి మహేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షులు కామిశెట్టి బాబు, కోనేటి సునంద, కౌన్సిలర్లు గరిశపాటి లక్ష్మీదేవి, కమాల్, వరికూటి ఓబుళరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు మల్లికార్జునప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

- చెన్నమరాజుపల్లెలో శుక్రవారం సాయంత్రం ఆంధ్రప్రదేశ్‌కి మళ్లీ జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ జేష్టాది శారద, గ్రామ నాయకులు నక్కం శ్రీనివాసులు, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రైతుల విషయంలో రాజకీయం చేయవద్దు

**ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి**



రాజుపాళెం వద్ద మైలవరం నుంచి వస్తున్న నీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు, అధికారులు

రాజుపాళెం : 'పెద్దాయనా.. రైతుల విషయంలో రాజకీయం చేయవద్దు' అని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద రెడ్డి మాజీ ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డికి సూచించారు. ఉత్తర కాలువకు పూడిక తీయడంతో రాజుపాళెం వద్ద వస్తున్న నీటిని శుక్రవారం ఎమ్మెల్యే రాచమల్లు, మండల వైస్ ఎంపీపీ నారాయణ రెడ్డి, కేసీ కెనాల్ డీఈ బ్రహ్మారెడ్డి, మైలవరం డీఈ అశ్వర్థ నారాయణతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల పట్ల స్వచ్ఛమైన హృదయంతో ఉంటానన్నారు. రైతుల మీద రాజకీయం చేయడమంటే శవాల మీద పేలాలు ఏరుకోవడమేనని ఎద్దేవా చేశారు. చిన్నదానికి, పెద్దదానికి పత్రికలకెక్కుతావే.. ఈ రైతుల విషయం పట్ల కలెక్టర్‌తో ఎందుకు మాట్లాడలేదని అన్నారు. ఏకదాటిగా అధికారంలో ఉన్న పెద్దాయన పంట కాలువల్లో పూడిక కూడా తీయించలేదని ఎద్దేవా చేశారు. జగన్ ప్రభుత్వంలో వందకు వంద శాతం పేదలందరూ సంక్షేమ పథకాలు అందడంతో ఆనందంగా ఉన్నారని.. అందరూ జగన్‌కే ఓటు వేస్తారన్నారు. ఇచ్చిన హామీలన్నింటినీ పార్టీలకు అతీతంగా నెరవేర్చిన జగన్ లాంటి గొప్ప నాయకుడిని చూపించగలుగుతావా పెద్దాయనా అని సవాల్ విసిరారు. రాష్ట్రంలో మెరిట్ ఆధారంగానే ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చారన్నారు. బటన్ నొక్కడం వల్ల నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు జమకావడంతో మళ్లీ జగన్ అధికారంలోకి వస్తారని టీడీపీ నాయకులకు బాధగా ఉందన్నారు. గతంలో చంద్రబాబు బటన్ నొక్కి పేదవాళ్లకు న్యాయం చేయాలి కాదా అని ప్రశ్నించారు. తల కిందికి పెట్టి కాళ్లు పైకి పెట్టి తపస్సు చేసినా చంద్రబాబు సీఎం కాలేరన్నారు. 2014 నుంచి 19 వరకు ఐదు సంవత్సరాలు కుందూనది, కేసీ కాలువల్లో నీరు పారిందా పెద్దాయనా అని ప్రశ్నించారు. ప్రస్తుతం రాజోలిలో నీళ్లు లేకపోతే కలెక్టర్, అధికారులతో మాట్లాడి నీటిని తెప్పించామన్నారు. వెంగళాయపల్లె గ్రామ సమీపంలోని టంగుటూరు ఉప కాలువ వద్ద పూడికతీత పనులను ప్రారంభించామని.. నాలుగు రోజుల్లో టంగుటూరు కాలువకు నీళ్లు ఇస్తున్నామన్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు అంజనీకుమారి, రెండవ వైస్ ఎంపీపీ సుబ్బరత్నమ్మ, వైస్ ఎంపీపీ గౌతంరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాజారాం రెడ్డి, ఎంపీటీసీ శివనాగిరెడ్డి పాల్గొన్నారు.

**ఆరుతడి పంటలకే నీళ్లు..**

ఈ ఏడాది వర్షాలు లేక ఆరుతడి పంటలకు మాత్రమే నీళ్లు ఇస్తామని ఇదివరకే రైతులకు తెలియజేశామని కేసీ కెనాల్ డీఈ బ్రహ్మారెడ్డి తెలిపారు. ఆయన రాజుపాళెంలో మాట్లాడుతూ దీన్ని అధిగమించేదాని కోసం ఎమ్మెల్యే రాచమల్లు కలెక్టర్‌తో మాట్లాడి ఎస్సార్‌బీసీ నీళ్లు తెప్పించగలిగామన్నారు. అధికారికంగా నవంబరు చివరి వరకు కేసీ కాలువకు నీరు వస్తుందని తెలిపారు.

### రైతులను ఆదుకుంటాం

రాజుపాళెం : ఈ ఏడాది సకాలంలో వర్షాలు లేక ఇబ్బందులు పడుతున్న రైతాంగానికి సాగునీరు అందించడంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద రెడ్డి సహకారం మరువలేనిదని మండల ఇన్‌చార్జి ఎంపీపీ వెలవలి నారాయణ రెడ్డి అన్నారు. మండల పరిషత్ సభా భవనంలో శుక్రవారం నారాయణ రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వారం రోజులుగా మైలవరం కాలువలో పూడికతీత పనులు చేశామని, దీంతో నీరు వస్తోందన్నారు. సమావేశంలో మండల రెండవ వైస్ ఎంపీపీ సుబ్బరత్నమ్మ, ఎంపీటీసీ శివనాగిరెడ్డి, కోఆప్షన్ సభ్యురాలు గౌసియా, అధికారులు పాల్గొన్నారు.

### టీడీపీ మోసాన్ని, వైఎస్ జగన్ మేలును బేరీజు వేసుకోవాలి

మైదుకూరు : అధికారంలోకి వచ్చేందుకు ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక టీడీపీ చేసిన మోసాన్ని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా చేసిన మేలును ప్రజలు బేరీజు వేసుకోవాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి అన్నారు. శుక్రవారం మైదుకూరు మున్సిపాలిటీలోని 8వ సచివాలయం పరిధిలో రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని నిర్వహించారు.

బ్రహ్మంగారిమఠం : సంక్షేమ పథకాలు, అభివృద్ధి నిరంతరం కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో మళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉండాలని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి తెలిపారు. శుక్రవారం సోమిరెడ్డిపల్లె 1 గ్రామ సచివాలయం పరిధిలో సాయంత్రం వై ఏపీ నీడ్స్ జగన్ అనే కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడారు. అస్సలు జగన్ మళ్లీ సీఎం ఎందుకు కావాలి అనేది నిరుపేదలకు తెలియాలంటే ప్రతి కార్యకర్త, వలంటీర్ ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ మంచిని తెలియజేయాలన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రొద్దుటూరు : నియోజకవర్గ పరిధిలో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏపీఎస్‌పీడీసీఎల్ ఈఈ శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

### దివ్యాంగ విద్యార్థులకు అభినందన

మైదుకూరు : జిల్లా కేంద్రంలో జరిగిన ఆటల పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపిన పట్టణంలోని జెడ్పీ బాలుర హైస్కూల్‌కు చెందిన దివ్యాంగ విద్యార్థులు ఫణీంద్ర, సాత్విక్, నరసింహులును శుక్రవారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి, ఉపాధ్యాయులు అభినందించారు.

### శాస్త్రీయ దృక్పథం పెంపొందించడమే లక్ష్యం

బద్వేలు అర్బన్ : విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించడమే లక్ష్యమని జనవిజ్ఞానవేదిక జిల్లా గౌరవ సలహాదారులు చింతంరెడ్డి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో బద్వేలు, గోపవరం, అట్లూరు, బి.కోడూరు మండలాల్లోని హైస్కూల్ స్థాయి విద్యార్థులకు చెకుముకి సైన్స్ ట్యాలెంట్ టెస్ట్ పరీక్ష నిర్వహించారు.

### సీపీఐ నిరసన

ప్రొద్దుటూరు : పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడిని ఖండిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక పుట్టపర్తి సర్కిల్‌లో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.రామయ్య, ఏరియా కార్యదర్శి పి.సుబ్బరాయుడు మాట్లాడారు. మైనారిటీ నాయకుడు ఎస్ఎస్ మొహిద్దీన్ మాట్లాడారు. సీపీఐ నాయకులు శివారెడ్డి, హరి పాల్గొన్నారు.

### డిగ్రీ కళాశాలలో ఇంటర్నేషనల్ అకౌంటింగ్ డే

పోరుమామిళ్ల : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం వాణిజ్య విభాగం ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డాక్టర్ నరేష్ అధ్యక్షతన ఇంటర్నేషనల్ అకౌంటింగ్ డే కార్యక్రమం నిర్వహించారు. సమావేశంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ అకౌంటింగ్ పితామహుడు లూకా ఫాసియోలిని ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు ఉన్నత స్థితికి చేరాలన్నారు. కామర్స్ అధ్యాపకురాలు పర్వీన్ మాట్లాడుతూ అకౌంటింగ్ డే ప్రాముఖ్యత, నియమాలు, ఉద్యోగ అవకాశాలు వివరించారు.